హీరో విశ్వక్‌సేన్ ఇంట్లో చోరీ

బంజారాహిల్స్, మార్చి 15 : సినీ నటుడు విశ్వక్‌సేన్ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శనివారం ఉదయం ఫిలిం నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఫిలింనగర్ రోడ్ నంబర్ 8లో నటుడు విశ్వక్‌సేన్ తన తండ్రి రాజుతో కలిసి ఉంటున్నాడు. శనివారం ఉదయం 5.50 గంటలకు గుర్తు తెలియని ఓ వ్యక్తి వీరి ఇంట్లోకి ప్రవేశించాడు. నేరుగా రెండో ఫ్లోర్‌లోని గదిలోకి వెళ్లి రెండు బంగారు ఉంగరాలు, హెడ్‌సెట్ తీసుకొని పారిపోయాడు. ఈ విషయాన్ని సీసీటీవీలో గమనించిన విశ్వక్‌సేన్ తండ్రి రాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయంపై డ్రోన్ ఎగురవేత..

ఇద్దరిని అదుపులోకి తీసుకున్న సైఫాబాద్ పోలీసులు

సిటీబ్యూరో, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సచివాలయంపై డ్రోన్ ఎగురవేసిన ఇద్దరిని సైఫాబాద్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ నెల 11వ తేదీ రాత్రి ఇద్దరు డ్రోన్ ఎగురవేశారని సెక్రటేరియట్ అధికారులు సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వంశీ, నాగరాజు డ్రోన్ ఎగురవేసినట్లు గుర్తించిన సైఫాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సచివాలయం అవుట్ పోస్ట్‌తో పాటు లాన్ ఏరియాను డ్రోన్‌తో చిత్రీకరించినట్లుగా అధికారులు తెలిపారు.

రాజకీయ యోధుడు కాన్షీరామ్

వికారాబాద్, మార్చి 15 : భారతదేశ రాజకీయాల్లో పెను భూకంపాన్ని సృష్టించిన రాజకీయ యోధుడు కాన్షీరామ్ అని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కో కన్వీనర్ వెంకటేశ్ తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాన్షీరామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ యోధుడు కాన్షీరామ్ 91 జయంతి కార్యక్రమాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. భారత దేశంలోని 10% లేని అగ్రవర్ణాల చేతిలో ఉన్న సంపదను అధికారాన్ని 90% బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు సామాజిక, రాజకీయంగా, ఆర్థిక రుచి చూపించిన వీరుడు కాన్షీరామ్ అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ వికారాబాద్ జిల్లా కో కన్వీనర్లు, మండల కన్వీనర్లు, బీసీ, ఎస్టీ, ఎస్సీ నాయకులున్నారు.

సగం నెలైనా సరుకులేవి..?

- 15 రోజులు దాటినా అరకొరగా రేషన్ సరుకుల పంపిణీ
- 30 శాతం దుకాణాలకు సైతం రేషన్ చేరవేయని వైనం

పరిగిలోని పౌర సరఫరాల శాఖ స్టాక్ పాయింట్

పరిగి, మార్చి 15 : ప్రతినెల ఇచ్చే రేషన్ సరుకులే సక్రమంగా సరఫరా చేయలేని సర్కారు త్వరలోనే సన్నబియ్యం ఇస్తామంటూ బీరాలు పలుకుతున్నది. సన్న బియ్యం ముచ్చట తర్వాత, అసలు ఎప్పటి వలే బియ్యం సరఫరా చేయలేక సతమతమవుతున్నది. తెల్ల రేషన్‌కార్డు గలవారికి ఒక్కొక్కరికి నెలకు 6 కిలోలు బియ్యం, అన్నపూర్ణ కార్డువారికి 10 కిలోలు, అంత్యోదయ కార్డుపై 35 కిలోలు బియ్యం అందజేస్తారు. వాస్తవానికి ప్రతి నెల మొదటి తేదీ కంటే ముందే రేషన్ సరుకులు సంబంధిత దుకాణాలకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఒకటవ తేదీ నుంచి రేషన్ సరఫరా ప్రారంభించి 15వ తేదీ వరకు ఇంకా ఎక్కడైనా మిగిలిపోతే 20వ తేదీ లోపు తెల్ల రేషన్‌కార్డుదారులకు రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ పూర్తి చేయాలి. కాగా రేషన్ దుకాణాలకే బియ్యం సరఫరా కాకుంటే కార్డుదారులకు అందజేయడం ఎలా అని రేషన్ డీలర్లు వాపోతున్నారు. పరిగి నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో ఈ నెల 15వ తేదీ శనివారం నాటికి కనీసం 30 శాతం బియ్యం సరఫరా సైతం కాలేదంటే పరిస్థితి ఎలా ఉన్నదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

15 రోజుల్లో 294 టన్నుల బియ్యం సరఫరా

పరిగి నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో ఈ నెల 15వ తేదీ నాటికి 294 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా జరిగినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. నియోజకవర్గంలోని పరిగి మండలంలో 45 రేషన్ దుకాణాలుండగా 8 దుకాణాలకు, దోమ మండలంలో 34 దుకాణాలుండగా 11 దుకాణాలకు, కులకచర్ల మండలంలో 30 దుకాణాలకు 12 రేషన్ షాపులకు, పూడూరు మండలంలో 34 దుకాణాలుండగా 9 రేషన్ షాపులకు బియ్యం సరఫరా జరిగింది. నాలుగు మండలాల్లో మొత్తం 143 రేషన్ దుకాణాలకు 1086 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా.. శనివారం నాటికి కేవలం 40 దుకాణాలకు 294 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయబడింది. ఇంకా 103 రేషన్ దుకాణాలకు 792 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేయాల్సి ఉన్నది.

ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి

ప్రభుత్వం ప్రతినెల సరిపడా కోటా బియ్యం సరఫరా చేయడంలో ఆలస్యం కావడం వల్ల గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో ప్రతినెల కనీసం మొదటి వారంలోపు అన్ని గ్రామాల్లో రేషన్ బియ్యం సరఫరా ప్రారంభమయ్యేది. తద్వారా 20వ తేదీ లోపు అందరికీ రేషన్ బియ్యం పంపిణీ పూర్తయ్యేది. కానీ ఇటీవలి కాలంలో రేషన్ దుకాణాలకే బియ్యం సరఫరా ఆలస్యంగా జరుగుతుండడంతో రేషన్‌కార్డుదారులకు చేరేసరికి మరింత సమయం పడుతున్నది. మార్చి నెలకు సంబంధించిన బియ్యం ఇప్పటికీ 30 శాతం దుకాణాలకే చేరాయి. అందులోనూ కొన్ని దుకాణాలకు సగం కోటా బియ్యం పంపిణీ జరిగినట్లు సమాచారం. ఒకవైపు బియ్యం రాకపోవడంతో రేషన్ దుకాణాలు తెరవడం లేదు. దీంతో బియ్యం ఎప్పుడు వస్తాయంటూ రేషన్‌కార్డుదారులు రేషన్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం పేదలకు ఉపయోగకరంగా సకాలంలో అందాల్సి ఉండగా ఆలస్యం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు డీలర్లు వాపోతున్నారు. సగం నెల గడిచిపోయినా బియ్యం రాలేదేమిటని ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇదిలావుండగా పరిగి ప్రాంతానికి పలుచోట్ల నుంచి రేషన్ బియ్యం సరఫరా జరిగేది. ఆయా ప్రాంతాల్లోని గోదాముల్లో స్టాకు లేకపోవడం వల్లే బియ్యం సరఫరాలో మరింత ఆలస్యం అవుతున్నదని పేర్కొంటున్నారు. ఎప్పటివరకు రేషన్ బియ్యం పూర్తిస్థాయిలో రేషన్ దుకాణాలకు చేరతాయంటే అధికారులు సరైన సమాధానం ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే రేషన్ బియ్యం పంపిణీ ఇలా ఉండడం గమనార్హం. ఇప్పటికైనా పౌర సరఫరాల శాఖ అధికారులు త్వరగా రేషన్ బియ్యం అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రపంచ వినియోగదారుల దినోత్సవంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

హక్కులపై అవగాహన కల్పించాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 15 : వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శనివారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కులు, స్థిరమైన జీవన విధానానికి న్యాయమైన పరివర్తన/మార్పు అనే అంశంపై వివిధ శాఖల అధికారులు, వినియోగదారులతో కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ, మోసాలకు గురికాకుండా చైతన్యపరచవలసిన అవసరం ఉందన్నారు. వినియోగదారులు మోసాలకు గురయినట్లయితే ఎక్కడ ఫిర్యాదు చేయాలనే విషయం కూడా స్పష్టంగా తెలియజేయవలసిన అవసరం అధికారులపై ఉందన్నారు. తూనికలు, కొలతల విభాగం అధికారులు విధిగా దుకాణాలను తనిఖీ చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో డీసీఎస్‌వో మోహన్‌బాబు, డీఎల్ఎంవో రియాజ్, కలెక్టరేట్ ఏవో ఫరీనా ఖాతూన్ పాల్గొన్నారు.

పంటలకు నీళ్లు వదలాలి

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం కొండాపూర్, రేగొండికి చెందిన రైతుల వరి పంటలు నీరు అందక ఎండిపోతున్న విషయంపై సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, తెలంగాణ జర్నలిస్టు ఫ్రంట్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మహేందర్ మాట్లాడుతూ.. కొండాపూర్ చెరువు కింద గల వరి పొలం దాదాపు 200 ఎకరాల్లో సాగులో ఉందన్నారు. ప్రస్తుతం చెరువులో నీళ్లు లేక పంటలకు నీరు అందకపోవడంతో సాగులో ఉన్న వరి పొలాలు మొత్తం కూడా ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. దాంతోపాటు దాదాపు రెండు గ్రామాల్లో రైతులు ఈ వరి సాగుపైన ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనికి జిల్లా అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే రెండు గ్రామాల రైతులతో కలిసి సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. రైతులకు మద్దతుగా ఉంటామని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి గీత, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులున్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆకస్మిక సందర్శన

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై వైద్యాధికారులతో చర్చిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, మార్చి 15 : ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ ఆకస్మికంగా సందర్శించి కార్యాలయంలోని వివిధ సెక్షన్లను పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ , డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవీంద్ర యాదవ్‌లతో వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు గురించి చర్చించారు. అనంతరం జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరుగుతున్న లీకేజీ మరమ్మతులు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ రిపేర్లు, నీటి సరఫరా, నీటి నిల్వ ట్యాంకులు, రోగులు వేచి ఉండే ప్రాంతంలో కనీస సౌకర్యాలు వంటి వివిధ అంశాల గురించి వైద్యులకు తగు సూచనలు చేశారు. సిబ్బంది విధులకు సమయానికి హాజరు కావాలని, ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రస్తుతం అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ఈ నెల చివరి నాటికి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డుపై చెత్త

పెద్దేముల్, మార్చి 15 : పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్ గ్రామం మీదుగా సుమారు 50 నుంచి 60 లారీల చెత్తను హైదరాబాద్‌లోని దమ్మాయిగూడ డంపింగ్ యార్డు నుంచి తాండూరులోని సిమెంట్ ఫ్యాక్టరీలకు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో పలుమార్లు మంబాపూర్ గ్రామంలో లారీల నుంచి చెత్త కింద పడి దుర్వాసన వస్తున్నది. శనివారం ఉదయం కూడా అదే జరిగింది. లారీలో నుంచి భారీగా చెత్త మంబాపూర్ ప్రధాన రోడ్డుపై పడి గ్రామ ప్రజలకు వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు పట్టించుకొని లారీల్లో చెత్త తీసుకెళ్లేవారికి తగు సూచనలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

‘జిమ్స్’ నిర్లక్ష్యం.. గర్భిణి మృతి

శంషాబాద్ రూరల్, మార్చి 15 : జిమ్స్ వైద్యుల నిర్లక్ష్యంతో నిండు గర్భిణి మృతి చెందింది. ఈ విషాద ఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి, బాధితుల వివరాల ప్రకారం మహేశ్వరం మండలం అమీర్‌పేట గ్రామానికి చెందిన ప్రమీల గర్భం దాల్చినప్పటి నుంచి ముచ్చింతల్‌లోని ‘జిమ్స్’లో వైద్యం చేయించుకుంటున్నది. ఈ నెల 11న వైద్యశాలకు వచ్చిన ప్రమీలను 13 వరకు అబ్జర్వేషన్‌లో ఉంచిన డాక్టర్ పూజిత అనంతరం మందులు రాసిచ్చి నొప్పులు వస్తే తిరిగి వైద్యశాలకు రమ్మని చెప్పి ఇంటికి పంపించేసింది. అయితే ఇంటికి వెళ్లిన ప్రమీల డాక్టర్ రాసిచ్చిన మందులు వేసుకోగానే పురిటి నొప్పులు రావడంతో పాటు ఛాతిలో నొప్పి వస్తుందని భర్త సాయిబాబుకు చెప్పగా వెంటనే ఆయన శుక్రవారం రాత్రి 10.30 గంటలకు జిమ్స్ దవాఖానకు తీసుకొచ్చాడు. అక్కడ సిబ్బంది పట్టించుకోకపోవడంతో పాటు వైద్యం చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రమీల చెమటలు పట్టి పడిపోయింది. అర్ధరాత్రి 12.00 గంటలకు వచ్చిన డాక్టర్ రామారావు ఆమెను పరిశీలించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

అక్కడ పోస్టుమార్టం నిర్వహించి ప్రమీల కడుపులోని 9 నెలల బాలుడిని బయటికి తీశారు. ఇదిలా ఉంటే జిమ్స్ వైద్యులతో పాటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత కారణంగా మండలవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. ఉదయం 7.45 గంటలకు మొదటి బెల్, 7.50కి ప్రార్థన, తరగతులు 8.00 గంటల నుంచి 12.30 వరకు తరగతులు నిర్వహించనున్నారు. - యాలాల, మార్చి 15

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కులకచర్ల : విద్యార్థులకు బహుమతులందజేస్తున్న శిక్షణా ఫౌండేషన్ సిబ్బంది, ఉపాధ్యాయులు

కులకచర్ల, మార్చి 15 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల కాంప్లెక్స్ పరిధిలో శనివారం శిక్షణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బొంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి పొందారు. ఈ సందర్భంగా పాల్గొన్న విద్యార్థులకు శిక్షణా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

వికారాబాద్ : మోమిన్‌పేట మండలంలోని పాఠశాల విద్యార్థులకు మోమిన్‌పేట కాంప్లెక్స్ స్థాయి క్విజ్ కాంపిటీషన్‌ను శిక్షణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కాంపిటీటేషన్‌లో ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని క్విజ్ పోటీలను విజయవంతం చేశారు. పోటీల్లో ఎంపీపీఎస్ బూరుగుపల్లి పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల అంతర్గత శక్తి వెలికితీయడానికి ఈ క్విజ్ కాంపిటీషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కొనియాడారు. కార్యక్రమానికి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, శిక్షణా ఫౌండేషన్ జిల్లా సీనియర్ మెంటార్ రాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని నిరసన

దోమ ఎంపీడీవో గ్యామ్యాకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

దోమ, మార్చి 15 : రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని దోమ మండల అధ్యక్షుడు చుక్కయ్య ఆధ్వర్యంలో దివ్యాంగులు దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్ది రాజేశ్‌తో కలిసి శనివారం దోమ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన అనంతరం ఎంపీడీవో గ్యామ్యాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించడంతోపాటుగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు తమ నిరసన గళం వినిపిస్తామన్నారు. మాయమాటలతో దివ్యాంగుల ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన 14 నెలల పాలనలో దివ్యాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా దివ్యాంగ సమాజాన్ని మోసం చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుధీర్, దోమ మండల మీడియా కన్వీనర్ మహేశ్‌కుమార్, పరిగి మండల ఉపాధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల విషయంపై దాడి

వికారాబాద్, మార్చి 15 : కోట్‌పల్లిలో చేపట్టిన డ్రైనేజీ పనుల నిర్మాణం విషయంలో దాడి చేసిన సంఘటన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్ఐ గఫార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సంగయ్య ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణం కోసం శుక్రవారం సాయంత్రం పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ విషయంలో కొందరు రాత్రి తన ఇంటికి వచ్చి, దుర్భాషలాడుతూ, తనపై దాడి చేశారని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. సంగయ్య ఫిర్యాదు మేరకు విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలియజేశారు.

ఎస్సై మధుసూదన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

చన్గోముల్ ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం కార్యాలయం ఎదుట ఫిర్యాదు చూయిస్తున్న బాధితురాలు

పూడూరు, మార్చి 15 : తన పేరున ఉన్న 23 గుంటల భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఈ నెల 9న ఫిర్యాదు చేస్తే ఎస్సై మధుసూదన్‌రెడ్డి పట్టించుకోవడం లేదంటూ నేరుగా ఎస్పీకే ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు శోభమ్మ పేర్కొన్నారు. పూడూరు మండలం పుడుగుర్తి గ్రామానికి చెందిన నాగులపల్లి శోభమ్మ పేరున 30 సంవత్సరాల క్రితం సర్వే నంబర్లు 54/ఇ1/2లో 13 గుంటలు, 54/ఇ/1/1లో 10 గుంటలు మొత్తం 23 గుంటల భూమిని తన తండ్రి నుంచి సెల్ డీడ్ చేసుకున్నట్లు వివరించారు. ఈ భూమికి సంబంధించి ఆన్‌లైన్ రికార్డులతో పాటు కొత్త పాస్ బుక్ ఉందని వివరించారు. ఈ భూమిపై తమ కుటుంబ సభ్యుల మధ్య కోర్టులో కేసు కొనసాగుతున్నదన్నారు. తమ మధ్య కొందరు నాయకులు జోక్యం చేసుకొని తమ భూమి కాజేసేందుకు తమ ఇంటిపై దాడులు చేసేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై చన్గోముల్ పోలీస్ స్టేషన్ ఎస్సైకి తాను ఫిర్యాదు చేస్తే భూ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నవారికి వత్తాసు పలుకుతూ తనపైనే ఆగ్రహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎస్పీకి ఎస్సై మధుసూదన్‌రెడ్డిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. లేకపోతే ఐజీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్సై మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా.. తాను ఎవరినీ బెదిరించలేదు. ఆమె ఫిర్యాదు మేరకు ఇరువర్గాలను పిలిపించాను. పెద్దల సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నడుచుకోవాలని మాత్రమే సూచించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మర్పల్లి, మార్చి 15 : మండలంలోని పట్లూర్ గ్రామానికి చెందిన మోముల ఆనందం(మోషా) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలై అసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి శనివారం ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు పంపగా స్థానిక మాజీ సర్పంచ్ ఇందిర గ్రామస్తులతో కలిసి మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు.

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీనియర్ నాయకుడు రమేశ్‌గౌడ్ తదితరులు

యాలాల, మార్చి 15 : యాలాల మండలం అక్కంపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. శనివారం సీనియర్ నాయకులు రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, దస్తప్ప సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.5 లక్షల ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధికి అనేక రకాలైన నిధులను తీసుకురావడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని నిధులను సమకూర్చి గ్రామ రూపురేఖలను పూర్తిగా మార్చుతామన్నారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

పిల్లలకు మార్గదర్శకంగా నిలువాలి

పరిగి, మార్చి 15 : తల్లిదండ్రులు పిల్లలకు మార్గదర్శకంగా నిలువాలని పరిగి మండలం మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్ అలీ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పిల్లల ముందు వారి తల్లిదండ్రులు ఆదర్శంగా నిలువాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే యంగ్ ఓడియేటర్స్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్ట్ వర్క్‌లు, ప్రదర్శన, ఇంగ్లిష్‌లో ఉపన్యాసాలు ఇతర ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శిక్షణా ఫౌండేషన్ మెంటార్ హనుమంతు పాల్గొన్నారు.

విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్‌అలీ

ఏఐ డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

దోమ మండల ఎంఈవో వెంకట్

అయినాపూర్‌లో ఏఐ డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈవో వెంకట్

దోమ,మార్చి 15 : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని దోమ ఎంఈవో వెంకట్ అన్నారు. దోమ మండల పరిధిలోని అయినాపూర్ ప్రాథమిక పాఠశాల, గుండాల గ్రామంలోని ఉన్నత పాఠశాలల్లో ఎంఈవో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని విద్యలో వెనుకబడిన విద్యార్థుల స్థాయి పెంచుకోవడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అయినాపూర్ పాఠశాల హెచ్ఎం మేఘ్యా, గుండాల పాఠశాల హెచ్ఎం మల్లారెడ్డి, దాదాపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం అమర్‌నాథ్, సీనియర్ ఉపాధ్యాయుడు రామకృష్ణ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీ రఘుసింగ్ పాల్గొన్నారు.

రేపు ఎన్ఆర్ఈజీఎస్ ప్రజా వేదిక

బంట్వారం, మార్చి 15 : మండలంలోని 11 జీపీలవారీగా 2023-24లో నిర్వహించిన గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ప్రజా వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు ఏపీవో సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామపంచాయతీల పరిధిలో ఏప్రిల్ 1, 2023 నుంచి 31 మార్చి 2024 వరకు చేపట్టిన పనులకు సంబంధించిన వాటిపై ఇప్పటికే గ్రామాలవారీగా గ్రామసభలు నిర్వహించారన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజా వేదిక నిర్వహించి, వివరాలు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, కూలీలు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రత్యేక ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి

బొంరాస్‌పేట్, మార్చి 15 : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దివ్యాంగ విద్యార్థులకు బోధిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు వికారాబాద్ జ